క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

మోమిన్‌పేట: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 11.30గంటలకు ఎంపీపీ వసంత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శైలజారెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు డివిజన్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.

వైకుంఠ ద్వార దర్శనం నేడు



శ్రీవారి మూలమూర్తి

కొడంగల్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా బాలాజీనగర్ పద్మావతి సమేత మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం 6 గంటలకు శ్రీవారిని వైకుంఠ ద్వారం నుంచి దర్శించుకునే అవకాశం కల్పించినట్లు ధర్మకర్తలు తెలిపారు. అనంతరం తిరుచ్చి ఉత్సవం, గీతా పారాయణం, తిరుప్పావై ప్రవచనం ఉంటుందని అర్చకులు పేర్కొన్నారు.

26న ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్: ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆప్తాల్మిక్ అధికారి లయన్ హరినాథ్ తెలిపారు. కలెక్టర్, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, కొడంగల్ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నేత్ర సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచితంగా మందులతో పాటు అవసరమైన వారికి శస్త్రచికిత్స చేయనున్నట్లు వెల్లడించారు.

అంబులెన్స్‌ను వినియోగంలోకి తేవాలి



అంబులెన్స్‌ను చూపిస్తున్న కాంగ్రెస్ నాయకుడు

కుల్కచర్ల: 2014లో ఎమ్మెల్యే నిధులతో ప్రభుత్వ ఆసుపత్రికి సమకూర్చిన మినీ అంబులెన్స్‌ను వినియోగంలోకి తేవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. శుక్రవారం ఆయన ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి మాట్లాడారు. నాడు ఎమ్మెల్యేగా టి. రామ్మోహన్‌రెడ్డి ఉన్నప్పుడు అందించిన అంబులెన్స్‌ను.. గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా స్టిక్కర్‌ను తొలగించి నిరుపయోగం చేసిందని ఆరోపించారు. అదే వాహనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ



పడిపూజలో శుభప్రద్ పటేల్

తాండూరు టౌన్: బీసీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు, బీఆర్ఎస్ నాయకుడు శుభప్రద్ పటేల్ ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్ప స్వామి దేవాలయంలో ఘనంగా అయ్యప్ప పడిపూజను నిర్వహించారు. ఇందులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

చేవెళ్ల: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని దేవునిఎర్రవల్లి గ్రామ నాయకులు, సర్పంచ్ మానిక్యరెడ్డి అన్నారు. చేవెళ్ల మండలం దేవునిఎర్రవల్లి గ్రామంలో శుక్రవారం ఈదమ్మ, మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠాపన, బొడ్రాయి ప్రతిష్ఠ నిర్వహించారు. ఇందులో భాగంగా రెండు రోజులుగా గ్రామంలో వేదపండితులు వేదమంత్రాలతో హోమాలు, యజ్ఞాలు ప్రత్యేక పూజలు చేశారు. ఇంటింటి నుంచి గ్రామస్తులు బోనం ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు.

చందిప్పలో పనుల నిలిపివేత

శంకర్‌పల్లి: మండలంలోని చందిప్ప గ్రామంలో సర్వే నంబర్ 124లోని భూమిపై రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేశారని తహసీల్దార్ సురేందర్ తెలిపారు. అడిషనల్ కలెక్టర్ ఆదేశానుసారం శుక్రవారం సుమారు 7నుంచి 30 ఎకరాల్లో జరుగుతున్న పనులను వారు నిలిపివేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. అనుమతులు లేకుండా పనులు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంతో ఈ విషయంపై గ్రామస్తులు మూకుమ్మడిగా ప్రజావాణితో పాటు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన అదనపు కలెక్టర్ ఈ భూమిపై స్టేటస్ కో విధించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

తెల్ల జొన్నలకు.. డిమాండ్ ఫుల్

- తగ్గిన సాగు.. పెరిగిన ధర
- క్వింటాకు రూ.7,500



తెల్లజొన్న పంట

పెద్దేముల్: మార్కెట్‌లో తెల్ల జొన్నలకు డిమాండ్ పెరిగింది. ఏటేటా సాగు తగ్గుముఖం పట్టడం.. ధరలు పెరగడం నిత్యకృత్యంగా మారింది. గతంలో వేల ఎకరాల్లో పంటలు పండగా.. ప్రస్తుతం వందల ఎకరాలకు పరిమితమైంది. ఫలితంగా క్వింటా జొన్నలకు రూ.7,500లకు చేరింది. ఇక్కడ సరైన ఆదరణ లేకపోవడంతో క్రమంగా రైతులు చెరకు, వరి, పత్తి, కంది తదితర పంటల వైపు మొగ్గుచూపడం గమనార్హం.

పెరిగిన వాడకం..

మండల పరిధి మారేపల్లి, నాగులపల్లి, రుద్రారం, నర్సాపూర్, జనగాం, మంబాపూర్, పెద్దేముల్, ఇందూరు, కందనెల్లి, తింసాన్‌పల్లి, హన్మాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో గతంలో రైతులు తెల్ల జొన్నను అధికంగా సాగు చేసేవారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో ఇతర పంటలపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో సాగు విస్తీర్ణం ఘననీయంగా తగ్గిందని చెప్పవచ్చు. ప్రస్తుతం మార్కెట్లో ఏ గ్రేడ్ జొన్నలు రూ.7 వేల నుంచి రూ.7,500లు ధర పలుకుతోందని, వాటికి తోడు పచ్చ జొన్నలకు డిమాండ్ ఏర్పడినట్లు రైతులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా షుగర్, బీపీ ఉన్న వారు జొన్న రొట్టెలు వాడుతూ.. పోషకాహారంపై మొగ్గుచూపుతుండటంతో జొన్నల రేటు పైపైకి ఎగబాకినట్లు స్పష్టం అవుతోంది. సాగు తగ్గడంతో పశువులకు మేత కూడా కరువైందని, అప్పట్లో రూ.400నుంచి రూ.500లకు కట్ట పలికిన చొప్ప, ప్రస్తుతం రూ.వెయ్యి నుంచి రూ.1,200లు అయిందని, అది కూడా సమయానికి లభించడం లేదని పలువురు చెప్పారు. దీంతో పశువుల మేతకు పక్కరాష్ట్రం కర్ణాటక నుంచి తీసుకురావాల్సి వస్తోందని తెలిపారు.

కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలి



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్

కుల్కచర్ల: కరోనా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి మాధురి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో కరోనాపై అవగాహన కల్పించారు. దేశంలో కరోనా మళ్లీ విజృంభిస్తోందని, అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏమైనా వైరస్ లక్షణాలు ఉంటే, వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రత్నలత, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, శివాని, సుజాత, వెంకటమ్మ, రత్నమ్మ, మంగమ్మ, గౌరీ, శ్రీలత, సుజాత, జంగమ్మ, భారతమ్మ, చంద్రకళ, నవీన్, ప్రశాంత్, శ్రీనివాస్, రఫీ, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

అవినీతిని రూపుమాపేందుకు నడుంకట్టాలి: వెంకట్

కుల్కచర్ల: చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావాలని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత రాజకీయాలు కమర్షియల్‌గా మారాయని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత రాజకీయ పార్టీల నుంచి కానీ.. స్వతంత్రంగా కానీ.. పోటీ చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విజ్ఞానం ఉన్న యువత రాజకీయాల్లోకి రావడం వలన ప్రశ్నించడంతో పాటు, సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా కృషి చేస్తారని వెల్లడించారు. అవినీతి సైతం తగ్గుముఖం పడుతుందన్నారు.

'వికసిత్ భారత్'తో ఆర్థిక సహాయం



సమావేశంలో మాట్లాడుతున్న పాండుగౌడ్

ధారూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'వికసిత్ భారత్' పథకం ద్వారా పేదలకు బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్ అన్నారు. శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమం గురించి వివరించారు. అనంతరం మాట్లాడారు. పార్టీలకు అతీతంగా చిరు వ్యాపారులకు వికసిత్ ద్వారా నిధులు అందేలా ప్రజా ప్రతినిధులు, నాయకులు కృషి చేసి, వారి ఆర్థిక బలోపేతానికి పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమౌళి, వివిధ పార్టీల నాయకులు బుజ్జయ్యగౌడ్, ఎన్. విశ్వనాథం, బాబాఖాన్, రవి, రమేశ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను పునర్విభజించండి



తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీఎస్‌పీఎస్ సంఘం నాయకులు

కుల్కచర్ల: నిరుద్యోగులకు న్యాయం జరిగేలా వికారాబాద్ జిల్లాను పునర్విభజించాలని పీఎస్‌పీఎస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ పోరాటం చేసిన తెలంగాణ ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని చెప్పారు. తమకు ఇష్టం వచ్చినట్లు పాలకులు జిల్లాలను విభజించారని, ఫలితంగా స్థానిక యువతకు ఉద్యోగాలు రాక ఆవేదనకు గురవుతున్నారని వెల్లడించారు. పరిశ్రమలు లేక, ఉపాధి అవకాశాలు దొరకక కుంగుబాటుకు లోనవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర నూతన నాయకత్వం జిల్లాల విభజనపై పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ, రామకృష్ణ, సాయి భరత్, శరత్, గొల్ల ఆంజనేయులు, అంతారం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



నీటిశుద్ధి ప్లాంట్‌ను పరిశీలిస్తున్న వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గ్రామ శివారులోని మిషన్ భగీరథ నీటి శుద్ధి ప్లాంట్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంట్ వద్ద నీటిని శుద్ధి చేసే తీరును ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పట్టణంతో పాటు గ్రామాలకు తాగునీటి సరఫరా విషయంలో సమస్యలు రాకుండా మిషన్ భగీరథ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. నల్లా కనెక్షన్‌లు లేని వారికి వెంటనే ఇచ్చి, నీటిని సరఫరా చేయాలన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే అధికారులు తన దృష్టికి తీసుకరావాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణితంతో సర్వం సాధ్యం

- లెక్కలు అంటే భయం వద్దు
- విద్యావిజ్ఞానంలో ప్రత్యేకమైనది మ్యాథ్స్
- శ్రీనివాస రామానుజన్ జయంతిలో విద్యాధికారులు



కుల్కచర్ల: కస్తూర్బాలో రామానుజన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు

కుల్కచర్ల: గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రం కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబీవీ ప్రత్యేక అధికారిణి దేవి మాట్లాడారు. విద్యావిజ్ఞానంలో ప్రత్యేకమైనది గణితశాస్త్రమని పేర్కొన్నారు. గణితంతో సర్వం సాధ్యమని, ఒక వ్యక్తి జీవన ప్రమాణాన్ని, సంస్థ అభివృద్ధిని సంఖ్యలతోనే సూచించాల్సి ఉంటుందని వివరించారు.

ఇష్టపడి చదవాలి

పరిగి: గణితాన్ని కష్టపడి కాదు, ఇష్టపడి చదవాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. రామానుజన్ జయంతి సందర్భంగా పట్టణకేంద్రంలోని నంబర్ 1 ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. దేశానికి గణితంలో ప్రపంచవ్యాప్తంగా పేరుప్రఖ్యాతలను తీసుకువచ్చిన గొప్ప గణిత వేత్త రామానుజం అని కొనియాడారు. ఆయన్ను స్మరిస్తూ గణితంలో సాధన చేస్తే.. సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు.

క్విజ్ పోటీలు

కొడంగల్: గణిత పితామహుడు రామానుజన్ జయంతి సందర్భంగా రావులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులకు ఉపన్యాస, పాటలు, కవితలు, నృత్యం, గణిత క్విజ్ తదితర పోటీలను నిర్వహించారు. హెచ్ఎం శ్యామలమ్మ, ఉపాధ్యాయులు అనంతలక్ష్మి, ముత్యప్ప, సత్య గీత, నరేందర్, అంజ్యానాయక్, శుక్లాదేవి, శ్రీనివాస్, శంకరయ్య, భ్రమరాంబ పాల్గొన్నారు.

స్వయం పరిపాలనా దినోత్సవం

కొడంగల్ రూరల్: రామానుజన్ జయంతి సందర్భంగా అక్షర హైస్కూల్‌లో గణిత దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణిత ప్రయోగాలు చేశారు. వాటి గురించి తోటివారికి వివరించారు. అనంతరం పాఠశాలలో స్వయం పరిపాలనా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కరస్పాండెంట్ సత్యనారాయణ యాదవ్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

నిత్యజీవితంలో..

బొంరాస్‌పేట: మనిషి నిత్యజీవితంలోనే గణిత శాస్త్రం ఉందని బొంరాస్‌పేట, దుద్యాల, కొడంగల్ మండలాల ఎంఈఓ రాంరెడ్డి అన్నారు. రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణితశాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు గోపాల్, అనిల్‌కుమార్, చంద్రశేఖర్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు కవిత, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: వికారాబాద్ పట్టణం కొత్తగడిలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలతో పాటు పలు ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ గణిత దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ అపర్ణ పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఆదర్శంగా తీసుకోవాలి..



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

దోమ: విద్యార్థులు గణితాన్ని కష్టపడి కాకుండా, ఇష్టపడి చదివితే వాటి ఫార్ములాలు అర్థం అవుతాయని బొంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్ అన్నారు. రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ కీర్తిని ప్రపంచానికి చాటిన మహనీయుడు రామానుజన్ అని కొనియాడారు. ప్రతి విద్యార్థి ఆయన్ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం గణిత ఉపాధ్యాయురాలు మాధురిని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటయ్య, కయ్యూం, ప్రవీణ్ కుమార్, విజయసాయి, సీఆర్‌పీ వెంకటేశ్, బీఈడీ ఛాత్రోపాధ్యాయులు, స్కూల్ చైర్మన్ అనంతయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్‌లో..



పరిగి: రామానుజన్ జయంతిలో విద్యాధికారి తదితరులు

సంక్షిప్త వార్తలు

● తిరుపతిరెడ్డికి సన్మానం



యాలాల: సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డిని శుక్రవారం మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. తాండూరు పట్టణంలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరైన ఆయనను లక్ష్మీనారాయణపూర్ గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. తిరుపతిరెడ్డిని కలిసిన వారిలో ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

● ప్రొసిడింగ్స్ ఇప్పించాలి



అనంతగిరి: దళితబంధు మంజూరయిన వారికి ప్రొసిడింగ్స్ ఇప్పించి, లబ్ధి పొందేలా చూడాలని అర్హులైన దళితులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. 5 నెలల క్రితం పథకానికి దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో మంజూరయిందని తెలిపారు. బెనిఫిషరీ ఐడీ కూడా వచ్చిందని పేర్కొన్నారు. కానీ ఎన్నికల కోడ్ కారణంగా స్కీంను నిలిపివేశారని తెలిపారు. దళితుల జీవనోపాధి కోసం ఏర్పాటు చేసిన పథకాన్ని సత్వరమే అమలు చేయాలని కోరారు.

● దర్గాకు దారి చూపించాలి

కొడంగల్ రూరల్: పురాతన షేక్ షా పహాడి దర్గాకు వెళ్లేందుకు దారి చూపాలని ముస్లింలు తహసీల్దార్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం మాజీ ఉప సర్పంచ్ ఎస్ఎం.గౌసన్ ఆధ్వర్యంలో ముస్లిం వెల్ఫేర్ కమిటీ సభ్యులు తహసీల్దార్ విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. గతంలో పొలాల నుంచి దర్గాకు వెళ్లేందుకు మార్గం ఉండేదని, ప్రస్తుతం పట్టాదారులు పొలాలకు కంచె వేయడంతో రోడ్డు లేకుండా పోయిందని పేర్కొన్నారు. ప్రార్థనలు, కందూరాలు చేసుకోవడానికి ఇబ్బందిగా ఉందని, రోడ్డు ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

● స్వయం ఉపాధిని పెంపొందించుకోవాలి

బంట్వారం: యువత స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని మైనార్టీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు జహీర్ పాష అన్నారు. శుక్రవారం ఆయన బంట్వారం మండలం తొర్మామిడిలో ఖాన్స్ బైక్ పాయింట్‌ను ప్రారంభించి మాట్లాడారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుకున్న యువత వివిధ రంగాల్లో నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం కూడా ఉపాధి అవకాశాలను మెరుగు పరిచి, యువతకు ఆర్థికంగా చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో బైక్ పాయింట్ నిర్వాహకులు హుస్సేన్, బషీర్‌మియా, ఖాదర్, అంజాద్ తదితరులు పాల్గొన్నారు.

● పీహెచ్‌సీలో ఉచితవైద్య శిబిరం

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో విద్యార్థులు, వృద్ధులు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు.

● నేడు క్రిస్మస్ కానుకల పంపిణీ

తాండూరు టౌన్: క్రిస్మస్‌ను పురస్కరించుకుని ప్రభుత్వం ఆధ్వర్యంలో శనివారం క్రైస్తవులకు కానుకలు పంపిణీ చేయనున్నట్లు తాండూరు ఆర్డీఓ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని అంతారం రోడ్డులో గల వైట్ ప్యాలస్ ఫంక్షన్‌హాల్‌లో మధ్యాహ్నం 1 గంటకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని వెల్లడించారు. అనంతరం విందు ఉంటుందని తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి రానున్నారని, క్రైస్తవులు తరలి రావాలని కోరారు.

● గ్రామకంఠం సర్వే



బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని గ్రామకంఠం భాగాన్ని, హద్దులను శుక్రవారం అధికారులు సర్వే చేశారు. గ్రామ విస్తీర్ణం, హద్దులు, ఖాళీ ప్రదేశాలను గుర్తించారు. చుట్టుపక్కలవారు స్వాధీనం చేసుకున్న స్థలాలను గుర్తించి, ఖాళీ చేయాలని ఆదేశించారు. ఇందులో పంచాయతీ, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

● ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

పూడూరు: మండల పరిధి చెంచుపల్లి గ్రామంలో శుక్రవారం నూతన శివాలయం ఎదుట ధ్వజస్తంభం, దేవతామూర్తుల విగ్రహాలు, బొడ్రాయిని ప్రతిష్ఠింపచేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సురేందర్, సర్పంచ్ వజన, నాయకులు బుచ్చయ్య, నరేందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు

ఎమ్మెల్యేకు బీసీ సంఘం నేతల వినతి




ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

షాద్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ శుక్రవారం బీసీ సంఘం నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు తగిన ప్రాధాన్యత ఇచ్చి, రిజర్వేషన్లు కల్పించాలన్నారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీల అభివృద్ధికి ప్రభుత్వం పాటు పడాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు జీనిగుంట రాములుగౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు దేవయ్య, మండల అధ్యక్షుడు మేడిగ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రాజుగౌడ్, దేవేందర్, తుమ్మల నర్సింహులు, క్యాసెట్ శ్రీనివాస్, మురళీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గంతో సత్వరపరిష్కారం

రిటైర్డ్ జడ్జి సాంబశివరావు



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న రిటైర్డు జడ్జి

చేవెళ్ల: పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించుకునేందుకు రాజీ మార్గంతోనే సాధ్యమని రిటైర్డ్ జడ్జి సాంబశివరావు తెలిపారు. చేవెళ్ల కోర్టు ఆవరణలో శుక్రవారం ట్రాఫిక్ కేసులకు సంబంధించి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో ఆయనతో పాటు బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. లోక్ అదాలత్‌లో వాయిదాలు పెండింగ్‌లు లేకుండా నేరుగా రాజీతో కేసును కొట్టివేయనున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ మండలాల పరిధిలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మద్యం తాగి వాహనాలు నడిపి పోలీసులకు పట్టుబడిన కేసులను పెండింగ్‌లో లేకుండా పరిష్కరించుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఈ లోక్ అదాలత్ శుక్రవారం నుంచి ఈ నెల 30 వరకు ప్రతి రోజు కొనసాగుతుందన్నారు.